

రథసప్తమి ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ మల్లికా గర్గ్

ప్రజాశక్తి -తిరుమల తిరుమలలో ఈ నెల 16వ తేదీ జరగబోయే శ్రీవారి రథసప్తమి ఉత్సవాలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసి ఉత్సవాలను విజయవంతం చేస్తామని తిరుపతి జిల్లా నూతన ఎస్పీ మల్లికా గార్గ్ తెలిపారు. ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన ఆమె, మొదటగా తిరుమలలో రథసప్తమి ఏర్పాట్లను పరిశీలించారు. టీటీడీ సివిఎస్వో నరసింహా కిషోర్ , ఇతర పోలీసు అధికారులతో కలిసి శ్రీవారి ఆలయ మాడవీధులతో పాటు తిరుమలంతటా ఎస్పీ క్షేత్రస్థాయిలో పరిశీలించి రథసప్తమి ఉత్సవ విషయాలను తెలుసుకున్నారు. రథసప్తమి ఉత్సవాలను సక్సెస్ చేయడానికి పోలీసు శాఖ తరపున తమవంతు కషి చేస్తామని మీడియాతో అన్నారు. అంతకముందు ఆమె కుటుంబసభ్యులతో కలిసి నైవేద్య విరామ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో తిరుపతి ఎస్పీగా పనిచేసే అవకాశం కలిగిందని సంతోషం వ్యక్తం చేశారు.

రంగురాళ్లా..వజ్రాలా..!

'మెగా' ...ఖ'నిజం' తేల్చాలి

• కాసరం చెరువులో గప్‌చిప్‌గా తరలింపు • గ్రామస్తులు అడ్డుకున్నా బేఖాతర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి/తొట్టంబేడు

మెగా మట్టి మాఫియా నానాటికీ మితిమీరిపోతోంది. మెగా మట్టి దోపిడీపై పత్రికల్లో, టీవీల్లో వరుస కథనాలు వస్తున్నా రెట్టించిన ఉత్సాహంతో అక్రమాలకు పాల్పడుతోంది. ఈ క్రమంలో మట్టే కాదు తవ్వకాల్లో లభించే ఖనిజాలను సైతం అమ్మేసుకునే స్థాయికి మెగా యాజమాన్యం చేరుకోవడం గమనార్హం. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కాసరం చెరువులో మెగా తవ్వాకాల్లో బయటపడ్డ విలువైన రాయిని దొంగలిస్తూ చివరకు గ్రామస్తులకు పట్టుబడ్డ సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఇది వజ్రపు రాయిగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తుండటం కొసమెరుపు. వివరాల్లోకి పోతే...

మెగా సంస్థ నాయుడుపేట నుంచి మదనపల్లి వరకు ఆరు లైన్ల రోడ్డును ఏర్పాటు చేస్తున్న విషయం అందరికీ విదితమే. మొదటి దశలో భాగంగా ఈ పనులను ప్రముఖ సంస్థ మెగా కంపెనీ రూ.5 వేల కోట్ల వ్యయంతో చేపడుతోంది. ఇప్పటికే 50 శాతం పైగా పనులు పూర్తయ్యాయి. అయితే పనులను చేసే సమయంలో వీరికి అవసరమైన మట్టిని చెరువుల నుంచి ఇష్టారాజ్యంగా తరలించడంతో చెరువులు లోయలుగా మారిపోతున్నాయి. దీంతో ఇటీవల శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చివోలు చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టడంతో చెరువులో దిగి లోతు తెలియకుండా తల్లి కూతుర్లు మతి చెందిన ఘటన చోటుచేసుకుంది. తొట్టంబేడు మండలంలోని కాసరం చెరువులో గత రెండు నెలల నుంచి భారీ టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. కొందరు అధికార పార్టీ నాయకుల సాయంతో ఈ తతంగం సాగుతోంది. ఏ



మండుటెండలో ధగధగా మెరుస్తున్న ఖనిజం

గ్రామంలో అయినా మట్టిని తరలించాలంటే ఆ పంచాయతీకి రాయల్టీ చెల్లించాల్సిన అవసరం ఉంది. అయితే ఎలాంటి రాయల్టీని కాసరం పంచాయతీకి చెల్లించకుండా కొందరు అధికార పార్టీ నాయకుల సహకారంతో మట్టిని తరలిస్తున్నారు. దీంతో మంగళవారం మట్టి తరలింపుల్లో భాగంగా కొన్ని విలువైన రాళ్లు బయటపడ్డాయి. వాటిని గుట్టు చప్పుడు కాకుండా మెగా యాజమాన్యం ఊరు దాటించినట్లు సమాచారం. సుమారు మూడు టిప్పర్ల రాళ్ళను అక్రమంగా తరలించినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తొట్టంబేడు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన ఎస్సై రాఘవేంద్ర మట్టి తరలిస్తున్న టిప్పర్ను స్వాధీనం చేసుకుని అందులో ఉన్న రాళ్లను పరిశీలించారు. అయితే అది ఏ రకం రాయో తెలియక పోలీసులు రెవెన్యూ అధికారులకు అప్పజెప్పారు. నాయుడు పేట నుంచి రేణిగుంట వరకు ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మెగా కంపెనీ మట్టి తవ్వకాలు ఎక్కువయ్యాయి. గతంలో గుండేలి గుంట పంచాయతీ చెరువులో భారీ టిప్పర్లు పెట్టి మట్టిని తరలించేశారు. ప్రస్తుతం చెరువు మొత్తం వర్షపు నీరు చేరి ఎంత లోతు ఉందో కూడా తెలియలేని పరిస్థితి. ఈ క్రమంలో గత రెండు నెలలుగా మెగా కంపెనీ కాసరం చెరువులో మట్టి తవ్వకాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో బయటపడిన రాళ్ల విలువ కోట్ల రూపాయల ఉంటుందని ఊహాగానాలు వినపడుతున్నాయి. అయితే మంగళవారం ఒక్కరోజేనా లేక గత రెండు నెలలుగా జరిపిన తవ్వకాల్లో విలువైన రాళ్లు కూడా ఉన్నాయా..? అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. టిప్పర్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని విషయం తెలియగానే మెగా కంపెనీలో పనిచేస్తున్న ఓ ప్రతినిధి పోలీస్ స్టేషన్కు వచ్చి ఎస్ఐతో మాట్లాడినట్లు సమాచారం. మెగా కంపెనీ చేపడుతున్న రోడ్డు పనులకు మట్టి అవసరమే కానీ మట్టితో పాటు ఈ విలువైన రాళ్లను గుర్తించాలంటే మైనింగ్ అధికారులు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. పోలీసులు మాత్రం ఇది సున్నపు రాయంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అసలు ఈ సంఘటనపై కేసు కూడా నమోదు చేయలేదు. మెగా యాజమాన్యం రాయి చౌర్యం వివాదం నుంచి బయటపడేందుకు భారీగానే లాబీయింగ్ నడుపుతున్నట్లు చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనా నిజానిజాలు తెలియాలంటే పురావస్తు శాఖ, మైనింగ్, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కాసరం గ్రామానికి చేరుకుని చెరువు తవ్వకాల్లో బయటపడిన రాళ్లను పరిశీలించాల్సిన అవసరం ఉంది.

సి.రామాపురం డంపింగ్‌యార్డు సమస్యపై చెవిరెడ్డి పోరాట సిత్రాలు (పాతచిత్రాలు)

'చెవి'కెక్కిందా..!

నాడు పోరాటం.. నేడు నిస్తేజం..

'డంపింగ్‌యార్డు'పై 'చెవిరెడ్డి' ద్వంద్వవైఖరి

ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా..

'ఈ ఫొటోలన్నీ చూస్తుంటే ఏదో ఎప్పుడో ఎక్కడో చూసినట్లుగా ఉన్నాయి కదూ.. ఔనండీ.. మన నియోజకవర్గ ఎంఎల్ఎ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నపుడు డంపింగ్ యార్డు తరలించాలంటూ దీర్ఘకాలికంగా చేసిన పోరాట దృశ్యాలు.. ఓకే అప్పట్లో టిడిపి అధికారంలో ఉంది.. చేయలేదు.. అధికారంలోకి వచ్చిన ఈ ఐదేళ్లల్లో ఏమయ్యింది.. చెవిరెడ్డి పట్టించుకుని అధికారంలోకి వచ్చిన మరుక్షణమే చేసి ఉండొచ్చు కదా.. అస్సలు పట్టించుకున్నా పాపాన పోలేదు.. అదే బూర్జువా పార్టీల ద్వంద్వవైఖరి. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఒకలా, అధికారంలో ఉన్నపుడు మరోలా.. (ప్రజాశక్తి - రామచంద్రాపురం)

పాలకుల 'నాడు-నేడు' సిత్ర విసిత్రాలు

తిరుపతి నగర చెత్తను డంపింగ్ చేసేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం చుట్టుగుంట రామాపురం (సి.రామాపురం) అటవీ ప్రాంతంలో ఉండడంతో 2017లో ఏర్పాటు చేసింది. అయితే పరిసర ప్రాంతాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. డంపింగ్‌యార్డును వేరేచోటకు తరలించాలన్న డిమాండ్ ముందుకొచ్చింది. దీంతో 2017, జూన్ 22న సి.రామాపురం అడపారెడ్డిపల్లి రోడ్డు (లోకమాతాపురం వద్ద) తిరుపతి కార్పొరేషన్‌కు సంబంధించిన చెత్త తరలించే వాహనాలను మూడు రోజుల పాటు రేయింబవళ్లు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిద్రాహారాలు మాని నేలపై పడుకుని నిరసన చేపట్టారు. డంపింగ్‌యార్డు వల్ల పరిసర ప్రాంత ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, వాసన భరించలేకపోతున్నారని, దుర్వాసనకు బతకలేకున్నామని వాపోయారు. కార్పొరేషన్ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించడంతో అప్పటి (ప్రతిపక్షంలో) శాసనసభ్యుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో 25 మందికి పైగా రామచంద్రాపురం పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 38/2017 మేరకు కేసు నమోదయ్యింది. అప్పటి కార్పొరేషన్ కమిషనర్ హరికిరణ్, కలెక్టర్ ప్రద్యుమ్న, పోలీసు ఉన్నతాధికారులతో కూడిన కమిటీ పలు దఫాలు గ్రామస్తులతోచర్చలు జరిపి 2017, జూన్ 25న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు 29 మందిని చిత్తూరు కేంద్ర కారాగారానికి తరలించారు. జైల్లోనూ అన్నం తినకుండా చెవిరెడ్డి నిరాహారదీక్షను కొనసాగించారు. ఏడు రోజులకు బెయిల్ మంజూరయ్యింది. చెవిరెడ్డి అంతటితో ఆగకుండా కూపుచంద్రపేట వద్ద ఆందోళన చేపట్టి చెత్తవాహనాలను అడ్డుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పోరాటం 2019 ఎన్నికలకు కొంతమేర చెవిరెడ్డికి ఉపయోగపడిందనే చెప్పవచ్చు. ప్రతిపక్షంలో ఉన్నపుడు పోరాటాలు చేసి రాద్ధాంతం చేసిన చెవిరెడ్డి, వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడుస్తున్నా, రాష్ట్ర రాజకీయాలనే శాసించే స్థాయిలో ఉన్నా డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపలేదని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. సమస్యల పరిష్కారం కంటే 'తాయిలాల'తో ఓటర్లను మభ్యపెట్టారని మండిపడుతున్నారు.

జీవో కాపీలు దగ్ధం

అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి -వెంకటగిరి

రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగడ్తూ, అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలంటూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడిఓ కార్యాలయం ఎదుట ప్రభుత్వ జీవో కాపీని తగలబెట్టారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నాయకులు కుమార్ స్వామి మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయ అప్రెంటిస్ విధానాన్ని పోరాటం చేసి రద్దుచేసుకున్నామని, గత ప్రభుత్వంలో రద్దు చేసిన జిఓను మరల వైసిపి ప్రభుత్వం అమలు చేయాలని చూడటం గర్హనీయమన్నారు.

ఎన్నికల వేళా... 'పన్ను'పోటు

5శాతం ఆస్తిపన్ను పెంపుకు సన్నాహాలు
ఇంటిపన్నుతో కలిపి వసూలుకు నిర్ణయం
డిమాండ్ నోటీసులు సిద్ధం చేసిన కార్పొరేషన్
పార్కింగ్ ఛార్జీల వసూళ్లకూ ప్రణాళిక సిద్ధం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నగరవాసులపై పన్నుల భారం మోపుతూనే ఉంది.. ప్రతిపక్షంలో ఉన్నపుడు ప్రజలపై కురిపించిన ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించిందన్న విమర్శలు మూటగడుతూనే 'పన్ను' పోటు పెంచుతోంది. తాజాగా రాష్ట్ర ఆర్థిక సంఘం ఆదేశాల మేరకు ఆస్తిపన్ను చెల్లించేవారిపై ఐదు శాతం అంటే దాదాపు మూడు కోట్లకు పైగా అదనపు భారాన్ని మోపడానికి రంగం సిద్ధమయ్యింది. మరోవైపు బహిరంగ ప్రదేశాల్లో పార్కింగ్ ఛార్జీలు వసూలు చేయడానికి ఆర్థికసంఘం సిఫార్సు చేయడంతో ఇకపై ఎక్కడికక్కడ పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి వాహన చోదకుల నుంచి ఛార్జీలను వసూలు చేయనుంది. తద్వారా మరో రెండు కోట్ల ఆదాయం కార్పొరేషన్‌కు రానుంది. వసూలైన నిధుల్లో కనీసం 20శాతం కూడా నగరాభివృద్ధికి వెచ్చించకుండా నిధులు వేరే వాటికి మళ్లిస్తుందని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఏప్రిల్ నుంచి డిమాండ్ నోటిసులో అదనపు ఆస్తిపన్ను కలిపి ఇవ్వనున్నారు. ఇదే గనుక జరిగితే అద్దెకుండే వారిపైనా ఆటోమేటిగ్గా భారం పడనుంది.

వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వార్షిక అద్దె విలువ మూలధన విలువ ఆధారిత ఆస్తిపన్ను



విధానాన్ని అమల్లోకి తెచ్చింది. మార్కెట్లో భూమి విలువ, భవనం విలువలో 0.13 శాతాన్ని ఆస్తిపన్నుగా నిర్ణయించారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో భారమంతా ఒకేసారి పడకుండా ఏటా 15శాతం పెంచుకునేలా ప్రతిపాదించారు. తిరుపతి నగరపాలక సంస్థకు ఆస్తిపన్నుల రూపంలో ఏడాదికి ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు కలిపి దాదాపు రూ.60 కోట్ల ఆదాయం వస్తుంది. మరో ఐదుశాతమంటే దాదాపు రూ.3 కోట్ల వరకూ భారం పడనుంది.

యూజర్‌ఛార్జీల మోత

రాష్ట్ర ప్రభుత్వం 2020 నుంచి యూజర్ ఛార్జీల వసూళ్లు మొదలు పెట్టింది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో కొన్నిచోట్ల మురికివాడలను మినహాయించింది. 50 డివిజన్లున్న తిరుపతిలో మూడు లక్షల జనాభా ఉంది. 65వేలకు పైగా ఇళ్లున్నాయి. యూజర్‌ఛార్జీల కింద ప్రతి ఇంటికి రూ.40, అపార్టుమెంట్‌వాసులకు రూ.50-100 చొప్పున చెత్తపన్ను వసూలు చేస్తున్నారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో చెత్తపై నెలకు రూ.50 లక్షలు వసూలు చేయాల్సి ఉండగా, కేవలం 25-30 లక్షలు మాత్రమే వసూలు చేస్తోంది. యూజర్‌ఛార్జీల పేరుతో నెలకు రూ.70 నుంచి కోటి రూపాయలు చేయాలన్న లక్ష్యం ఉంది.

ఐదుశాతం ఆస్తిపన్ను పెంపు రద్దు చేయాలి
టి.సుబ్రమణ్యం, సిపిఎం

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఐదుశాతం ఆస్తిపన్ను పెంపును వెంటనే రద్దు చేయాలి. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత 15శాతం ఇంటిపన్ను పెంచడమే కాకుండా, చెత్తపై యూజర్‌ఛార్జీలు వేసి పెనుభారం మోపింది. ఇప్పటికే నిత్యావసర ధరలన్నీ పెరిగి ప్రజల నడ్డి విరిచారు. మళ్లీ భారం మోపితే ప్రభుత్వం ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది.

'ఇరకం' దీవిలో పోలింగ్ కేంద్రాలు తనిఖీ

పడవలో, ట్రాక్టర్‌లో వెళ్లిన కలెక్టర్ లక్ష్మీశ
టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

ప్రజాశక్తి - తడ

మండలంలోని ఇరకం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ జి.లక్ష్మీశ పులికాట్ లేక్‌లో బోటులో ప్రయాణించి ఇరకం గ్రామం చేరుకుని, అక్కడ నుండి ట్రాక్టర్‌లో వెళ్లి తనిఖీ చేశారు. ముందుగా గ్రామంలో వెలసిన గ్రామ దేవత పోన్నియమ్మన్ అమ్మణ్ణి దర్శనం చేసుకున్నారు. అనంతరం కాలినడకన ఇరకం గ్రామం నందు ఏర్పాటు చేసిన 291, 292 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క ఓటరూ తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 291 బూత్‌లో 407 మంది, 292లో 670 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికీ బిఎల్ఒలు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పిహెచ్‌సిని తనిఖీ చేసి, మందులు సరిపడా ఉంచుకోవాలని, హైరిస్క్ ప్రెగ్నెన్సీవారు ఇద్దరు ఉన్నారని, వారికి మందులు, పౌష్టికాహారం అందించాలన్నారు. నులిపురుగుల నిర్మూలన మందులను పిల్లలు మింగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో ప్రకృతి సమతుల్యతను కాపాడుతూ టూరిజం కేంద్రంగా దీవిని అభివృద్ధి చేస్తామన్నారు. సర్పంచి భర్త గుణశేఖర్ మాట్లాడుతూ గ్రామంలోని మత్స్యకారుల పిల్లలు ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం బయట ప్రాంతాలకు వెళ్లలేక పడుతున్న ఇబ్బందులను వివరించారు. ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య చొరవతో పూడి గ్రామం వద్ద ఇళ్లస్థలాలు సేకరించామని, పంపిణీ ఆలస్యం అవుతుందని తెలిపారు. మత్స్యకారుల పట్టాల పంపిణీ పెండింగ్ అంశం వారం లోపు పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్ర నాథ్ రెడ్డి, తడ మండల తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎన్నికల డిటి పవన్ కుమార్, శరత్, సర్పంచ్ గుణశేఖర్, నాయుడుపేట డియస్పి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. సూళ్లూరుపేటలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్‌ను ఆర్డీవో కార్యాలయం ఎదుట ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య సత్కరించారు.

ఎంజిఎం సత్తా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ సెషన్-1 ఎన్టీఏ ఫలితాల్లో పట్టణానికి చెందిన ఎంజీఎం జూనియర్ కాలేజీ విద్యార్థులు సత్తా చాటారు. వి.వినయ్ 94.36675, ఎస్.యుగంధర్ రెడ్డి 91.933929, బీ.మేఘన 80.557766 పాయింట్లతో పట్టణ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరితో పాటు ఆర్.వినీషా, భాగ్యశ్రీ, కె.హేమంత్, బి.ముని సాయి కుమారి మెయిన్స్ కు అర్హత సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, వారికి సహకరించిన అధ్యాపకులను డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ప్రిన్సిపాల్ వి.ఎస్ రత్నం మంగళవారం అభినందించారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీలో బయోటెక్నాలజీ విభాగం నందు పరిశోధనలు నిర్వహించిన విద్యార్థిని కటారు సురేఖకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను ప్రదానం చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ప్రొఫెసర్ పివిజికె శర్మ పర్యవేక్షణలో 'ఇన్ విట్రో జనరేషన్ ఆఫ్ మిసాన్ జియల్ సెల్స్ ఫ్రమ్ హ్యూమన్ హెమటోపోయిటిక్ స్టెమ్ సెల్స్' అనే అంశముపై పరిశోధన చేశారు.

జెఈఈ మెయిన్స్‌లో 'ఆకాష్' అగ్రస్థానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

జేఈఈ మెయిన్స్ 2024 మొదటి సెషన్ లో అత్యుత్తమ పర్సంటేజ్ తో ఆకాష్ బైజుస్ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని ఆ విద్యాసంస్థల తిరుపతి శాఖ సీనియర్ అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ కుమార్ తెలిపారు. స్థానిక న్యూ బాలాజీ కాలంలోని ఆకాష్ బైజుస్ విద్యాసంస్థలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షల్లో తమ సంస్థకు చెందిన రిసి శేఖర్ శుక్ల 300 కు 300 మార్కులు 100 శాతం సాధించడం గర్వకారణం అన్నారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన ఇంజనీరింగ్ సంస్థలకు గేట్ వేగా జేఈఈ మెయిన్స్ ప్రాముఖ్యతను ఎత్తు చూపిన రిషి శేఖర్ శుక్ల ఆదర్శప్రాయమైన ప్రతిభను ప్రశంసించారు. అతనితోపాటు తిరుపతి ఆకాష్ బైజుస్ కు చెందిన రిత్విక్ 99.34, కె జయచంద్ర రెడ్డి 99.11, ఎం శివ

చరణ్ 98.69, మరో 20 మంది విద్యార్థులు 98 శాతం మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులతో కలిసి నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం భరత్ కుమార్, బ్రాంచ్ హెడ్ నరసింహులు, ఇంజనీరింగ్ అక్కడ మీకు హెడ్ రామ రమేష్, గీత విద్యా సంస్థల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

'నారాయణ' ప్రభంజనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విడుదల చేసిన జనవరి - 2024 మొదటి విడత జేఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని నారాయణ విద్యాసంస్థల డీజిఎం కొండలరావు తెలిపారు. న్యూ బాలాజీ కాలనీలోని నారాయణ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జెఈఈ మెయిన్స్ ఫలితాలలో తమ విద్యార్థులు వివస్వత్ 99.9, వివేకానంద రెడ్డి 99.8, దినేష్ ప్రసాద్ రెడ్డి 99.8, జస్వంత్ 99.8, సాయి ప్రసన్న 99.8, చెంచు తన్మయి క్రిష్ణ 99.8, పుష్కర్ 99.8 శాతం సాధించారన్నారు. మొత్తం ఏడుగురు విద్యార్థులు 99.8 శాతం కన్నా ఎక్కువ సాధించారని, అదేవిధంగా 99 శాతం

ప్రతిభ చాటిన విద్యార్థులు

పైన 16 మంది, 98 శాతం పైన 25 మంది, 95 శాతం పైన 65 మంది, 90 శాతం పైన మొత్తం 125 మంది విద్యార్థులు మార్కులు సాధించారని తెలిపారు. ఉత్తమ ప్రతిభచూపిన విద్యార్థులను అభినందించారు.

టీటీడీ విద్యాసంస్థల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : జెఇఒ

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

టీటీడీ జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు కార్యాచరణ రూపొందించాలని జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. టీటీడీ పరిపాలన భవనంలో విద్యాసంస్థలపై మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఈఓ మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించడం ద్వారా లభించే విద్యావకాశాల గురించి విద్యార్థులకు తెలియజేయాలన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివద్ధికి ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. డీఈవో డాక్టర్ భాస్కర్ రెడ్డి కి చాలా అనుభవం ఉందని, ఆయన సూచనలతో విద్యాసంస్థలను అభివద్ధికి పని చేయాలని కోరారు. అదేవిధంగా జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జేఈవో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు.

స్విమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

అధికార పార్టీ నేతల మీటింగ్‌కు స్విమ్స్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను తరలించిన స్విమ్స్ నర్సింగ్ సూపరింటెండెంట్ ప్రభావతి పై, ఇతర అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నగర కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలు తమ ఎన్నికల అవసరాలు తీర్చుకోవడానికి ఉద్యోగులను పావులుగా చేయడం సమంజసం కాదన్నారు. వీటిని గమనంలో ఉంచుకోకుండా తప్పుడు మార్గంలో వ్యవహరిస్తే చివరకు నష్టపోయేది ఉద్యోగులేనన్నారు. ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

కృతజ్ఞతలు చెప్పడం రాజకీయమా..?

నేనూ ఎర్రజెండా నీడనే పెరిగా...

టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ 'నా అధికారం పేదలకు మేలు చేయడానికే.. నేను కూడా ఎర్రజెండా నీడన పెరిగినవాడినే..' అని 38 నెలల పాటు నిరాహారదీక్షలు చేసి సఫలీకృతం అయిన టిటిడి అటవీ కార్మికులతో ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు నేతృత్వంలో టిటిడి ఛైర్మన్‌ను అటవీ కార్మికులు సత్కరించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ టిటిడిలోని కాంట్రాక్టు, కార్పొరేషన్, సొసైటీల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ న్యాయం జరిగేలా చూస్తున్నానన్నారు. ఏ చిన్న అవకాశం ఉన్నా వారి డిమాండ్లు పరిష్కరిస్తానన్నారు. తాను కేవలం ఓట్ల కోసం ఈ పనులు చేయడం లేదని, సామాన్యులకు మేలు చేయడమే తన సిద్ధాంతమని అన్నారు. పేదవారి కోసం నిస్వార్థంగా సేవ చేస్తున్న వారిపై రాజకీయ బురద చల్లడం మంచిది కాదన్నారు. కమ్యూనిస్టులతో తనకు భావసారూప్యత ఉన్నందునే కొన్ని అంశాల్లో వారితో కలిసి పనిచేస్తున్నానన్నారు. ఈ మాత్రానికే వారిమీద బురద చల్లడం మంచిది కాదన్నారు. తన దష్టికి వచ్చిన టీటీడీ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, గోశాల కార్మికులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు, సెక్యూరిటీ సిబ్బంది సమస్యలపై అధికారులతో చర్చించి వీలైనన్ని పరిష్కరిస్తాననిహామీ ఇచ్చారు.

అటవీ కార్మికులు, సిఐటియు నేతలతో మాట్లాడుతున్న భూమన కరుణాకర్‌రెడ్డి

ఎస్ఐ రవిబాబుకు సన్మానం

ప్రజాశక్తి - ఓజిలి : ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి రవిబాబును జాతీయ మానవ హక్కుల సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు జడ్డ చంద్రశేఖర్ , ఉపాధ్యక్షులు మునిరత్నం, సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ , ఓజిలి మండల అధ్యక్షులు బాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం కెవిఆర్ పురం గ్రామానికి చెందిన దీపక్ కుమార్‌కు ఆరోగ్యం సరిగా లేనందువల్ల వైద్యం ఖర్చుల నిమిత్తం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా మంగళవారం సీఎం సహాయనిధి నుండి మంజూరు అయిన 3 లక్షల రూపాయల చెక్కును కెవిఆర్ పురంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-తిరుపతి డెస్క్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్ బాష అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సరోజి నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం జాతీయ మహిళా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిదీన్ బాష మాట్లాడుతూ మహిళలకు ప్రధానంగా విద్య అవసరమని, రాజకీయ, ఉద్యోగ, వ్యాపార, క్రీడా రంగాల్లో మహిళలు ప్రాతినిధ్యం పెరగాలన్నారు. మహిళా విభాగం సమన్వయకర్త డాక్టర్ మాధవి మాట్లాడుతూ మహిళల జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చిట్టికళావతి, రమణమ్మ, విష్ణు ప్రియ, లక్ష్మీ ప్రసన్న, మాధవి, రవి విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని శివ ఇంగ్లీష్ మీడియం స్కూలులో 'జగనన్నకు చెబుదాం' ను తిరుపతి కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన బుధవారం ఉదయం 10 గంటలకి నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి ఏర్పేడు మండల ప్రజలు వారి వారి వినతులు, సమస్యలు తెలపాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ గిడ్డయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ వైద్యసేవలు ఎంతో ఉపయోగకరం

ప్రజాశక్తి -దొరవారిసత్రం: గ్రామీణ పేద రోగులకు ప్రభుత్వం అందించే వైద్య సేవలు బాగా అందుతున్నాయని వైద్యాధికారి చంద్రకళ అన్నారు. ప్రభుత్వం తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల పరిధిలోని ఏకొల్లు గ్రామపంచాయతీ, హెల్త్ క్లినిక్ పరిధిలో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ వీరభద్రయ్య, జనరల్ ఫిజిషన్స్ స్టీఫెన్ నవీన్, చంద్రకళ, వచ్చిన రోగులను పరీక్షించి అవసరమైన మందులు అందించారు. ప్రత్యేకించి కంటి సంబంధ సమస్యలపై ఆప్తమాలజిస్ట్ లలిత్ కుమార్ దృష్టిలోపం ఉన్న వారిని పరీక్షించి వారికి అవసరమైన అద్దాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామయ్య, వైద్యాధికారి చైతన్య, పి హెచ్ ఎన్ పద్మావతి, సూపర్వైజర్స్ గోపి కిరణ్, మైధిలి, ఎం ఎల్ హెచ్ పి లు ఏఎన్ఎమ్ లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి నేతలకు స్వాగతం పలికిన సుగుణమ్మ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా యూనివర్సిటీలో అప్పట్లో దిష్టిబొమ్మ దగ్ధం చేశారనే నెపంతో శేషాద్రి నాయుడు,రామ్ మోహన నాయుడును అరెస్టు చేశారు. మంగళవారం బెయిల్ పై వారు విడుదలయ్యారు. వారిని టిడిపి నాయకులు సత్కరించారు. ఎస్వి యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాళ్లిద్దరిని ఆ పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మన్నూరు సుగుణమ్మ , తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ , నగర పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చినబాబు, మహేష్ యాదవ్ , కార్పొరేటర్ ఆర్సి మునికృష్ణ , రాష్ట్ర నాయకులు బుల్లెట్ రమణ, దంపూర్ భాస్కర్ యాదవ్ , శ్రీధర్ వర్మ ,లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు దినకర్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం యువత నాయకులు పాల్గొన్నారు.

అలరించిన శ్రీసాయి స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 18వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆపస్మా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం రాజు, కార్యదర్శి రమణ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాలను అధిగమించేలా విద్యార్థులు తమను తాము మార్పు చేసుకోవాలన్నారు. క్రమ శిక్షణతో, పట్టుదలతో ముందు కెళుతూ ప్రతిభ చూపుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.. కరస్పాండెంట్ చంద్ర శేఖర్ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ తల్లిదండ్రుల మన్నలను పొందామన్నారు. పిల్లలకు ఒత్తిడి లేని చదువులు అందిస్తూ, వారిలో మానసిక ఉల్లాసాన్ని కలిగించేందుకు క్రీడలు, సాంస్కృత కార్యక్రమాల్లో సైతం వారికి శిక్షణ అందిస్తు న్నామన్నారు. తమను ఆదరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యా యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంటెక్ బాబు సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి -బుచ్చి నాయుడుకండ్రిగ: సత్యవేడు నియోజక వర్గం లో కాంగ్రెస్‌ని బలోపేతం చేయడానికి నియోజకవర్గ స్థాయిలో ఎంటెక్ బాబు విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో నే బి యన్ కండ్రిగ మండలంలో కారణి మిట్ట లో కమిటీ ఏర్పాట్లు కు ప్రణాళికను సిద్ధం చేసి బూత్ స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తుల తో రచ్చబండ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పేదవాళ్ళకి చేసిన మంచిని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చేసిన మంచినే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో షర్మిలని గెలిపిస్తే రాజశేఖర్ రెడ్డి పేరు నిలబెట్టేలా రాష్ట్రాన్ని పరిపాలిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజలు హాజరయ్యారు.

సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం లోని కందాడు, ఎండి పుత్తూరు, వికృతమాల, పంగూరు, చింతలపాలెం, పల్లం గ్రామాలలో నూతన సచివాలయం, భవన వెల్నెస్ సెంటర్స్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రసిడెంట్ గున్నేరు కిషోర్ రెడ్డి , ఎంపీపీ గీత, జెడ్పీటీసీ తిరుమలయ్య, కోనాటి రమణయ్య యాదవ్, వీర రాఘవరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీను యాదవ్, జనార్ధన్ యాదవ్ పాల్గొన్నారు.

టిడిపి నేతకు కడసారి వీడ్కోలు

ప్రజాశక్తి - ఓజిలి : టిడిపి సీనియర్ నేత కంకణాల రామ్మోహన్ నాయుడు అకాల మరణం పలువురుని కలచివేసింది. ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ఆదుకునే నాయకుడిని కోల్పోవడంతో గ్రామ ప్రజలకు కంటతడికి గురిచేసింది. సీనియర్ నేత టిడిపి క్రియాశీలక సభ్యులు కంకణాల రామ్మోహన్‌రావు సోమవారం మృతి చెందారు. అంత్యక్రియలు మంగళవారం అశృనివాళుల మధ్య ముగిశాయి. తమ నాయకుడిని కడసారి చూసేందుకు సూళ్లూరుపేట టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీమంత్రి పరసారత్నం, శ్రీపతి బాబు, టిడిపి సీనియర్ నాయకులు వల్లూరు సూర్య ప్రకాష్ రావుతో పాటు పలువురు పార్టీలకు అతీతంగా విచ్చేసి భౌతిక దేహానికి నివాళులు అర్పించారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి - తిరుపతిసిటి: ఈ నెల 16న శుక్రవారం రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవలను రద్దు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాదుకు చెందిన భక్తురాలు స్వర్ణకుమారి అందించిన పరదాల సెట్‌ను ఆలయంలో అలంకరించారు. రథసప్తమి పురస్కరించుకుని అభిషేకానంతర దర్శనం, లక్ష్మీపూజ, ఆర్జిత కల్యాణోత్సవం, కుంకుమార్చన, బ్రేక్ దర్శనం, ఊంజలసేవ, వేదాశీర్వచనం సేవలను టీటీడీ రద్దు చేసింది.ఈ కార్యక్రమంలో విజివో బాలిరెడ్డి, ఆలయ ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, ఎవిఎస్వో శైలేంద్రబాబు పాల్గొన్నారు.

నూతన సచివాలయాలను ప్రారంభించిన భూమన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో నూతనంగ నిర్మించిన రెండు సచివాలయాలను మంగళవారం టీటీడీ చైర్మెన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్ మాట్లాడుతూ 27వ డివిజన్ కి సంబంధించిన రెండు సచివాలయాలను మల్లయ్యగుంట కట్ట వద్ద 62.70 లక్షలతో నిర్మించారని, 44వ డివిజన్ రైల్వే కాలనీ వద్ద 25 లక్షలతో నిర్మించిన మరో నూతన సచివాలయం ప్రారంభించామన్నారు. ప్రజా అవసరాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు మునిసిపల్ కార్పొరేషన్ తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డిపాల్గొన్నారు.

మహిళలకు వెన్నుదన్ను

- మంత్రి ఆర్‌కె రోజా



మహిళలకు ఆసరా చెక్కులు అందిస్తున్న మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రాష్ట్ర మహిళకు వైసిపి ప్రభుత్వం వెన్నుదన్నుగా వుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కెరోజా అన్నారు. పుత్తూరు ద్రౌపదమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం వైఎస్ఆర్ ఆసరా నాల్గవ విడత పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఆడపడుచుల అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. వైఎస్ఆర్‌కు వారసుడిగా జగనన్న ముఖ్యమంత్రి కావడానికి అక్క చెల్లెమ్మలే కారణం అన్నారు. మహిళలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్నారన్నారు. మీ పిల్లలు చక్కటి చదువు చదువుకొని పోటీ ప్రపంచంలో నిలబడే విధంగా నాడు నేడు ద్వారా పాఠశాలలు పునర్నిర్మించి, విద్యాకానుక ద్వారా చక్కటి యూనిఫాం, పుస్తకాలు ఇచ్చి, జగనన్న గోరుముద్ద ద్వారా చక్కటి పౌష్టికాహారం, ఇంగ్లీష్ మీడియంతో బైజూస్ కంటెంట్ ద్వారా మంచి విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలకు పంపించే తల్లిదండ్రులకు అమ్మఒడి ద్వారా ఆర్థికంగా అండగా నిలుస్తున్నారన్నారు. విదేశీ విద్య, ఫీజు రీయింబర్స్‌మెంటు ద్వారా చదువుకోవాలన్న ప్రభుత్వమే భరిస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటివద్దకే పెన్షన్, చేయూత, ఆసరా, రైతు భరోసాలు ఇంటికే తీసుకొస్తున్నారని వివరించారు. అర్హత వున్న వారికి వారి పేర్లు అప్‌లోడ్ చేసి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సచివాలయాల ద్వారా అన్ని రకాల సర్టిఫికేట్లు, వైద్య పరీక్షలు చేస్తున్నారన్నారు. ఒక పుత్తూరు రూరల్ అర్బన్ కలిపి సంఘాలు మొత్తం 1758 సంఘాలు సభ్యులకు 18340 కు గాను వైయస్ఆర్ ఆసరా కింద మూడు విడదల కాగా దాదాపు అక్షరాల 33.87కోట్ల రూపాయలను ఇప్పటికే అందించామని తెలిపారు. నాలుగో విడత ఆసరా ద్వారా 11. 34 కోట్ల రూపాయలను అందించామని తెలిపారు. ఈ సమావేశంలో పుత్తూరు మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎం ఎన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ డి జయ ప్రకాష్, రూరల్ మండలం అధ్యక్షులు మునివేలు, వైస్ ఎంపీపీ మునుస్వామి రెడ్డి, లోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు, బోర్డు డైరెక్టర్లు, ఎంపీటీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీల సర్పంచులు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ కన్వీనర్ సచివాలయ కన్వీనర్, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు పాల్గొన్నారు.

విఆర్‌ఏల సమస్యలపై స్పందించాలి

సిఐటియు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కొల్లపూడి సుబ్బయ్య

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : విఆర్ఏల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలని సిఐటియు రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు కొల్లపూడి సుబ్బయ్య పేర్కొన్నారు. విఆర్ఏ దీర్ఘకాలిక సమస్యలపై తిరుపతి జిల్లా పరిధిలోని మండలాలకు సంబంధించిన విఆర్ఏలు అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, శ్రీ కాళహస్తి సిఐటియు కార్యాలయంలో బుధవారం జరగనున్న సమావేశానికి తప్పక హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లగా విఆర్ఏల సమస్యలపై నిరసనలు తెలిపినా, అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఏ సమస్యా పరిష్కారానికి నోచుకోక పోవడంతో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తేటతెల్లం అవుతోందన్నారు. సమస్యల పరిష్కారానికి కార్యా చరణ రూపొందించు కునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి ఒక్కరూ హాజరై ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏల గౌరవాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, అధ్యక్షులు డి గోవిందస్వామి పాల్గొన్నారు.

సెల్ ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరం: ఎంవిఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సెల్ ఫోన్‌లతో డ్రైవింగ్ చేస్తూ వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని గూడూరు ఎంవిఐ సునీల్ పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాలలో భాగంగా గూడూరు రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్ నుండి నర్సింగ్ విద్యార్థులు, ఆటో డ్రైవర్లతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ డిపోలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ సునీల్ మాట్లాడుతూ జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని సెల్ ఫోన్ డ్రైవింగ్ ఎంతో ప్రమాదకరమన్నారు. ఆటోలలో పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించుకోవడం రోడ్డుపై హఠాత్తుగా ఆటోలు నిలపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని డ్రైవర్లు జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు. అనంతరం రూరల్ సిఐ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగి క్షతగాత్రులైన వారికి వేలాది రూపాయలు అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నారని తర్వాత అప్పు తీర్చడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చాలని ఇటీవల కావలి వద్ద జరిగిన బస్సు రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ శ్రీహరిబాబు, ఆర్టీసీ డిఎం వెంకటేశ్వరరావు, నర్సింగ్ విద్యార్థులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

నేటి నుండి ఉద్యోగుల పోరుబాట

ఏపీ జేఏసీ ఛైర్మన్ బొప్పన లలిత్ కుమార్

ప్రజాశక్తి -సత్యవేడు: ప్రభుత్వ ఉద్యోగులు,పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేటి (బుధవారం) నుంచి పోరుబాటకు సిద్ధమైనట్లు ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పన లలిత కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల సంబంధించి ఐదేళ్లుగా ఎటువంటి పరిష్కారం లేదన్నారు. డీఏ బకాయిలపై ప్రభుత్వం స్పందించడం లేదని, ఇప్పటికే ఒక్క ఉద్యోగికి మూడు నుంచి నాలుగు లక్షలు రావాల్సి ఉందన్నారు. డీఏ సొమ్ము అందాల్సి ఉందన్నారు. తమ సొమ్మే 25 వేల కోట్ల రూపాయల వరకు ప్రభుత్వం వద్ద ఉందన్నారు. కనీసం పీఆర్సీ అమలుకు నోచుకోలేక పోతున్నామన్నారు. ఉద్యోగుల సమస్య గురించి పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని అన్నారు. ఈ నేపథ్యంలోనే అన్ని వర్గాల ఉద్యోగులు దీనిపై ఉద్యమం చేయడానికి సన్నద్ధమైనట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పోరుబాట కార్యాచరణ ప్రకటించామన్నారు. ఈ నేపథ్యంలోనే ఫిబ్రవరి 14వ తేదీన నల్ల బ్యాడ్జీలు ధరించి అన్ని కార్యాలయాల్లో వినతులు సమర్పిస్తామన్నారు. 15,16వ తేదీలలో భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని, 17న తాలూకా కేంద్రాలలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు. 20న కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామన్నారు. 21నుండి 24వ తేదీ వరకు అన్ని జిల్లాల పర్యటన చేసి ఉద్యోగులను సమాయత్తం చేస్తామన్నారు.27న ఛలో విజయవాడ నిర్వహించి ఉద్యోగుల సత్తా ఏమిటో తెలుపుతామన్నారు. అప్పటికి తమ సమస్యలపై ప్రభుత్వం దిగి రాకపోతే ఏ నిమిషంలో అయినా మెరుపు సమ్మె చేపడతామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని ఆయన కోరారు. లేదంటే ఉద్యమం తీవ్రం అవుతుందని హెచ్చరించారు.

గ్రామీణ బంద్ ను విజయవంతం చేయండి: సీపీఎం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మండల పరిధిలోని నెల్లటూరు, చెన్నూరు, తిప్పావరపాడు మంగళపూరు, గాంధీనగర్, గ్రామాలలో మంగళవారం మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16వ తేదీ జరిగే గ్రామీణ బంద్ ను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గూడూరు సీపీఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ మోదీ అనాలోచిత నిర్ణయాల వల్ల అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని గద్దె దించి, దేశాన్ని కాపాడుకోవాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ అధ్యక్షులు బి.వి.రమణయ్య, కార్యదర్శి సురేష్, కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్ ,బి. చంద్రయ్య, వెంకటేశ్వర్లు, గుర్రం రమణయ్య పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

జనసేన, టిడిపి నాయకుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి -గూడూరు రూరల్: జనసేన, టీడీపీ నాయకుల ఆత్మీయ సమావేశం మంగళవారం చిల్లకూరు మండలంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నతమైన ఆశయాలతో పవన్ కళ్యాణ్ జనసేనని ఏర్పాటు చేసి ప్రజా ప్రయోజనాలు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆశయ సాధనకు ఉడతా భక్తి సాయంగా స్నేహితులుగా తామంతా చేస్తున్నామని, పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి పని చేస్తున్నట్లే నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో జనసేన, టీడీపీ కలిసి పని చేయాలని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిట్టటూరు సుందర రామిరెడ్డి, అనురూప్‌లు కోరారు. గూడూరు టీడీపీ ఇన్‌ఛార్జి పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే పవన్ కళ్యాణ్ టీడీపీతో కలిశారని నియోజక వర్గంలో జనసేన నాయకులు పూర్తి సహకారం అందిస్తున్నారని, ఎక్కడైనా జనసేన క్యాడర్‌తో చిన్న పొరపొచ్చాలు ఉంటే టిడిపి నాయకులతో సమన్వయం చేసి ముందుకు నడుస్తామని తెలిపారు. ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసిన సుందర రామిరెడ్డి, చంద్రశేఖర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్ర శేఖర్ రావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు గూడూరులో ఉమ్మడి అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని అందరూ అనుగుణంగా జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన రాయలసీమ జోన్ 1 కన్వీనర్ కొట్టే వెంకటేశ్వర్లు, గూడూరు జనసేన టీడీపీ కార్యకలాపాల పీఓసీ కె మోహన్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిసెట్టి ఇంద్రవర్ధన్, కుందర్తి నాగార్జున, అలివేలు రాజశేఖర్, నవనీత్ కుమార్, అవినాష్, శంకర్ రాయలు ఓంకార్, విజయ్, తిరుపాలు, చెంచు కృష్ణయ్య పరమశ్ సాయి, కృష్ణ, మండపాటి మురళి రెడ్డి, శ్రీకొరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, వరదారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉప్పిరెడ్డి మధుసూదన్ రెడ్డి, జి పోలయ్య, డి మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 302 చాటర్ 598 పుత్తూరు , ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలోని స్థానిక ఆర్టీసీ డిపో సెక్యూరిటీ మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారికి అసోసియేషన్ అధ్యక్షులు వాకర్స్ బి బాబు శాలువాలతో సన్మానించి వారికి స్వీట్లు, పండ్లు ఇచ్చి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి బాబు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు అన్ని రంగాల్లోనూ దూసుకెళుతున్నారని మహిళలు ముందుకు వచ్చి అన్ని కార్యక్రమాలను మహిళలే నిర్వహిస్తున్నారని బాబు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి, డిప్యూటీ మేనేజర్ మంగమ్మ, ఏపీఎస్ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

బలిజలకు వైసీపీ మొండిచేయి: ఆర్కాట్ కృష్ణప్రసాద్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ బలిజలకు మొండి చేయి చూపించి మోసం చేశారని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన బుద్ధి చెబుతామని రాష్ట్ర బలిజ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ బలిజల పట్ల అవలంబిస్తున్న తీరును మంచిదిగా లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ రాయలసీమలో ఒక్క సీటును కూడా కేటాయించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికలలో అధిక శాతం జనాభా కలిగిన బలిజలకు వైసీపీ పార్టీ కేవలం రెండు సీట్లను చిత్తూరు, దర్శి మాత్రమే కేటాయించారన్నారు. ప్రస్తుతం ఈ రెండుసీట్లను కూడా వైసీపీ తమ సామాజిక వర్గానికే కట్టబెట్టడం మంచిపద్ధతి కాదన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సామాజిక వర్గానికే అన్ని పదవులు, అసెంబ్లీ సీట్లు కట్టబెడుతూ ఒక్క సామాజిక వర్గ ముఖ్యమంత్రి గానే వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో బలిజలు ఏకమై ఓటు రూపంలో వైసీపీ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెబుతారన్నారు. వైసీపీ ప్రభుత్వం రిజర్వేషన్ అంశం ఈడబ్ల్యుఎస్ కింద 10 శాతం రిజర్వేషన్ ను రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నగాని గత టిడిపి ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం బలిజలపై అక్కసుతో కేటాయించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాయల కృష్ణయ్య, బెల్లంకొండ సురేష్, రాజేంద్ర, రామారావు, బాసికర్ల రఘు పాల్గొన్నారు.

మామిడిలో దశల వారీగా సస్యరక్షణ చేపట్టాలి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: మామిడిలో మొదటి పూత దశ నుండి ప్రతి దశలోనూ క్రమం తప్పకుండా సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు సాధించ వచ్చని జిల్లా ఉద్యాన అధికారి డి దశరథ రామిరెడ్డి మామిడి రైతులకు సూచించారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని నెల్లుట్లవారిపల్లి, చిన్నగొట్టిగల్లు రైతు ఉత్పత్తి దారుల సంఘానికి ఉద్యాన శాఖ ద్వారా మంజూరైన కలెక్షన్స్ సెంటర్ నిర్మాణాన్ని పర్యవేక్షించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. చెట్టేవారి పాలెం, చిట్టేచర్ల పరిధిలోని మామిడి తోటలను పరిశీలించారు. ఈ ఏడాది మామిడిలో పూత ఆలస్యమైందని, ప్రస్తుతం మామిడి తోటలలో అక్కడక్కడా పచ్చి పూత దశ ఉందని ఇప్పుడు తేనె మంచు పురుగు , ఆంత్రక్నోస్ మచ్చ తెగులు నివారణకు బుప్రో ఫెజిన్ 25 ఎస్‌సి1.5 మిల్లీ లీటర్లు, హెక్సకొనజోల్2 మిల్లీలీటర్లు, అజాడి రెక్టన్ 1500 పిపిఎం 2 మిల్లీలీటర్లు మందులు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. గత సంవత్సరం పంట కోసిన తర్వాత కొమ్మలు కత్తిరింపులు చేసి ఎరువులు వేసి సరైన యాజమాన్య పద్ధతులు పాటించిన తోటల్లో పూత బాగానే వచ్చిందని తెలిపారు. మామిడిలో పిందెలు ఏర్పడి నిమ్మ కాయ సైజుకు వచ్చినప్పుడు పోషణ చాలా అవసరం అన్నారు. అప్పుడు నీటి సౌకర్యం ఉన్నా పది సంవత్సరాలు పైబడిన తోటల్లో ప్రతి చెట్టుకూ ఒక కేజీ యూరియా, ముప్పావు కేజీ పొటాష్ ఎరువులను వేసుకోవాలని సూచించారు. చెట్లకు ఆర్కా మాంగో స్పెషల్ 5 గ్రాములు 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే కాయలు మంచి సైజు పెరిగి నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. అనంతరం చిట్టెచెర్లలో పాక్ హౌస్ నిర్మాణాన్ని పరిశీలించారు. చిన్న గొట్టిగల్లు లోని నర్సరీని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శివకుమారి, వెలుగు ఎపిఎం కుమార్ , రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జిలు రాహుల్, కిశోర్, వనిత, వెంకటేశ్వరి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న జిల్లా ఉద్యాన అధికారి డి దశరథరామిరెడ్డి

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం తిరుపతిలో చోటుచేసుకుంది. తిరుపతి రూరల్ పోలీసుల కథనం మేరకు..తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వకుల మాత గుడి సమీపంలో మంగళవారం టీఎన్ 02 బిపి 5508 నెంబర్ గల ద్విచక్ర వాహనంపై వస్తున్న చెన్నై పట్టణంలోని రామలింగ నగర్‌కు చెందిన అరుణ్ కాంత్ (38)ను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తుచేస్తున్నారు.

తిరుపతిలో ఇద్దరు బాలికలు మిస్సింగ్

ప్రజాశక్తి తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోని రెండు వేరువేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలికలు మిస్సయిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం .. తిరుపతి రూరల్, మల్లంగుంట, వైఎస్ఆర్ కాలనీలో నివాసముంటున్న మౌనిక (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటి బయట దుస్తులు ఆరవేస్తూ కనపడకపోవడంతో తల్లిదండ్రులు బాలిక కోసం వెతికారు. బంధువుల,స్నేహితుల ఇంటి వద్ద బాలిక జాడ కనపడకపోవడంతో అనుమానం వచ్చిన తండ్రి తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో ఘటనలో అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజీవయ్య నగర్‌లో తల్లితో నివసిస్తున్న గీతశ్రీ (17) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. దుకాణానికి వెళ్లొస్తానని వెళ్లిన కుమార్తె తిరిగి రా పోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతుకుతున్నారు. అయినా కనిపించక పోవడంతో చెన్నారెడ్డి కాలనీకి చెందిన మహేష్‌తో చనువుగా ఉంటుందని తల్లికి అనుమానం వచ్చింది. దీంతో కుమార్తె కనబడుటలేదని తల్లి బి రామలక్ష్మి అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పు డబ్బు అడిగినందుకు మహిళపై దాడి

ప్రజాశక్తి - బాలాయపల్లి : అవసరాలు నిమిత్తం మండలంలోని జయంపు గ్రామంలోని సబ్ స్టేషన్‌లో సిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కూరపాటి రవి ఆదే గ్రామానికి చెందిన దేవరపల్లి సంపూర్ణమ్మ వద్ద రూ 8 వేలు తీసుకున్నాడు. ఆమె అప్పు అడిగినందుకు దాడిచేశాడని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎస్సై మహబూబ్ సుభాన్ కథనం మేరకు.. గత నెలలో సబ్ స్టేషన్ లో సిఫ్ట్ ఆపరేటర్ గా విధులు నిర్వహిస్తున్న రవి, సంపూర్ణమ్మ వద్ద రూ 8 వేలు అప్పు తీసుకున్నాడు. రెండు నెలల క్రితం రూ 2 వేలు తిరిగిచ్చాడు. ఈ నెలలో 13వ తేది రూ.6 వేలు ఇస్తామని చెప్పడంతో డబ్బులు అడిగినందుకు ఆమెపై గొడవలకు దిగి దాడి చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు డిగ్రీ కళాశాల విద్యార్థికి అరుదైన గౌరవం

విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బికాం తృతీయ సంవత్సరం చదువుతున్న టి మునస్వామి కి అరుదైన గౌరవం దక్కింది. గత నెల జనవరి 26న న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవం పెరేడ్ లో డిగ్రీ కళాశాల ఎన్‌సిసి విద్యార్థి పాల్గొనడం హర్షణీయమని కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం, దేశభక్తి కలిగిన విద్యార్థికి ఇలాంటి అరుదైన గౌరవం లభిస్తుందని సాధారణ డిగ్రీతోపాటు ఎన్‌సిసి లో కూడా రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. మునుస్వామి ఆంధ్రప్రదేశ్ తరపున న్యూఢిల్లీ పేరేడ్ కు ఎంపికై తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకుని వచ్చారని ఎన్‌సిసి అధికారి ఎం శ్రీనివాసులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, కామర్స్ అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు అభినందనలు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: సుధారెడ్డి

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి అధోగతి పాలైందని పులి వర్తి సుధా రెడ్డి దుయ్యపట్టారు. స్థానిక దీన్దార్లపల్లి పంచాయతీలో 'గడప గడపకు మీ పులివర్తి నాని'ని మంగళవారం నిర్వహించారు. టిడిపి మండల కన్వీనర్ బెల్లంకొండ మురళి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు బి కుమారస్వామి రెడ్డి, మునస్వామి నాయుడు, చలపతి, మౌలాలి, టిడిపి చాను, వేణు ఆచారి, కాదరవల్లి, రామనాధ రెడ్డి తదితరులు వారికి స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచక పాలన కొనసాగుతోందని భూ కబ్జాలు, దౌర్జన్యాలతో వైసిపి నాయకులు పేట్రేగిపోతున్నారన్నారు. ఇటీవల 25 లక్షల దీందార్లపల్లి పంచాయతీ బిల్డింగ్ వైసిపి నాయకుడు మాయం చేయడం ఇందుకు అద్దం పడుతోందన్నారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టిన వేధించడం నియోజకవర్గంలో పరిపాటిగా మారిందన్నారు. వైసిపికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా వున్నారని టిడిపి గెలుపు తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. అనంతరం తెట్టుపల్లి గ్రామానికి చెందిన ముండ్లపూడి రామ్ నాధ్ రెడ్డి, పులివర్తి సుధారెడ్డి సమక్షంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజలు తెలిపిన సమస్యలన్నీ పరిష్కారం అవుతున్నాయని అభివృద్ధి పనుల కోసం ఒక్కొక్క సచివాలయానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరీగా మురళి పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని వాములమిట్టలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. గూడూరు పట్టణంలోని వాములమిట్టలో సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ మేరీగా మురళి టెంకాయ కొట్టి భూమిపూజ చేశారు. స్థానికులు పలు సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సిసి రోడ్లు, కాలువల నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మీరా రెడ్డి , బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరు శ్రీనివాసులు, గోపి యాదవ్, సురేష్ రెడ్డి , పూర్ణ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ 25 వ వార్షికోత్సవం సందర్భంగా గూడూరు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మ్యండ లైజ్ కంపెనీ సహకారంతో విద్యార్థులకు కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ డిఇఓ శివ ప్రకాష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాజిక్ బస్ స్టాండ్ ఇండియా ఫౌండేషన్ విద్యార్థులకు సహకారం అందించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులు క్రీడల తో పాటూ చదువులోనూ రాణించాలన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ కబడ్డీ, వాలీ బాల్ క్రీడల్లో నైపుణ్యం చూపే విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా గూడూరు డివిజన్ పరిధిలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలకు స్పోర్ట్స్ మెటీరియల్, కబడ్డీ జెర్సీలు ఇస్తామన్నారు. భవిష్యత్ లో జిల్లా , రాష్ట్ర స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కాంచన, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం వరప్రసాద్ , పిడి శివకుమార్, సంస్థ ప్రతినిధులు సుమంత్, కోచ్‌లు హరికృష్ణ , లత , ఎలీషా బాబూ, మౌ నేంద్ర పాల్గొన్నారు.

తాగునీటి దాహార్తిని తీర్చిన సర్పంచి

పైపులైను ఏర్పాటు చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కొత్తపాలెం గిరిజన కాలనీ లో చాలాకాలంగా మంచినీటి సౌకర్యం లేకుండా గిరిజన వాసులు చాలా ఇబ్బందులు పడడం చూసి గ్రామ సర్పంచి శుభ్రతమ్మ, హరిప్రసాద్ వారి దాహార్తిని తీర్చేందుకు వారి సొంత నిధులతో సుమారు వెయ్యి అడుగులు పైపులైను ఏర్పాటు చేసి గిరిజన కాలనీ వాసుల దాహార్తిని తీర్చారు. గతంలో వారికి నీటి వసతి లేక చేతి బోర్లు కింద లేక వ్యవసాయ బోర్డు దగ్గరకు గిరిజన కాలనీవాసులు వెళ్లి నీటిని తుచ్చుకునేవారు. అది గమనించిన గ్రామ సర్పంచి పంచాయతీలో నిధులు లేకుండా తన సొంత ఖర్చులతో గిరిజన వాసుల బాధలను చూడలేక వారికి మంగళవారం ఉదయం నుండి జెసిపితో తవ్వించి కూలీల సహాయంతో మంగళవారం పైపులైను పైపులు అమర్చి తాగునీటి దాహార్తిని తీర్చారు. సర్పంచి శుభ్రతమ్మ హరిప్రసాదులకు గిరిజన కాలనీవాసులు అభినందనలు తెలిపారు.

పాసుబుక్కు పోయినది

తిరుపతి జిల్లా, నాయుడుపేట, ఎల్.వి.సాగరం (హరిజనవాడ) అగ్రహారంపేట నివాసి లేట్ చిన్నా వీరయ్య భార్య చిన్నం బుజ్జమ్మ సంబంధించిన పట్టా నెం.368, సర్వే నెం.534ఎ3. మా పొలంకు సంబంధించిన పాస్ బుక్ ది.నెం 20వ తేదీ 2023న జిరాక్స్ ల కోసం వెళుతుండగా నాయుడుపేట బజారు రోడ్డు సమీపంలో పోయినది ఎవరికైనా దొరికిన యెడల మాకు తెలియజేయగలరు.

ఇట్లు,
చిన్నం బుజ్జమ్మ ఫోన్ నెం :9014435484